## ఫెంగ్ షుయి



# ఇంట్లో మ్యూజికల్ గడియారం పెట్టండి

మంద్ర స్వరంలో విన్పించే సంగీతాన్ని అందరూ ఇష్టపడతారు. చాలామందికి సంగీతమంటే ప్రాణం. కొందరు ఒత్తిడిని అధిగమించడానికి తమకు నచ్చిన సంగీతాన్ని వింటుంటారు. సంగీతం అంటే టేప్ రికార్డర్ లోనో, సిడి ప్లేయర్‌లోనో వినడం మనకు తెలుసు. మనం సంగీతం వినాలనుకుని వాటిని ఆన్ చేస్తాం. అంటే ముందుగానే మనం సంగీతం వినడం కోసం మానసికంగా సిద్ధంగా ఉంటాం. అలా కాకుండా మనకు తెలీకుండానే మంద్ర స్వరంలో సంగీతం వినిపిస్తే ఎలా ఉంటుంది? చాలా హాయిగా ఉంటుంది. అలాంటి ఏర్పాటు ఇంట్లో చేసుకోవచ్చు.

సాధారణంగా ప్రతి ఇంటిలోనూ వాల్‌క్లాక్ ఉంటుంది. అయితే గంటకోమారు సంగీతం వినిపించే మ్యూజికల్ వాల్ క్లాక్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఈ గడియారం నుంచి వచ్చే సంగీతం మృదు మధురంగా మనసుకు ఆహ్లాదకరంగా ఉండాలి. గంటకోమారు ఇంట్లో ఇలాంటి సంగీతం వినడం చాలా మంచిది. ఇది ఆనందాన్ని కల్గించడమే కాకుండా మనం చేయాల్సిన పనులను కూడా సున్నితంగా గుర్తు చేసినట్టుగా ఉంటుంది. కొన్ని గడియారాల్లో సంగీతం కర్ణకఠోరంగా, పెద్ద ధ్వనితో ఉంటుంది. ఇలాంటివి ఇంట్లో పెట్టుకోకూడదు. ఇలాంటి సంగీతం వినగానే చికాగ్గా అనిపిస్తుంది. ఇంట్లో అంతవరకూ ఉన్న ఆహ్లాదకర వాతావరణం దెబ్బ తింటుంది. ఇక్కడో ముఖ్య విషయం గుర్తుంచుకోవాలి. గడియారాలను తలుపులపైన గాని, గుమ్మంపైన గానీ వేలాడగట్టకూడదు. ఇలా చేయడం వలన శుభానికి బదులు అశుభం జరుగుతుంది.

*

వారం వారం 'ఫెంగ్ షుయి' మీకోసం

## 'సరసి' కత

వైశంపాయనుడుంటున్న కాలనీలో ప్రతినెలా ఎవరికో ఒకరికి సన్మానం చేస్తూ వుంటారు. ఆ నెల ఎవరూ లేక, పోన్లే చాలా కాలమ్మట్టీ వెల్ఫేర్ అసోసియేషన్లో సభ్యుడిగా వుంటున్నాడు, ఓ సన్మానం లాంటిది చేస్తే పడుంటాడూ అని ఆ నెల వైశం పాయనుడికి సన్మానం పెట్టారు.

కమ్యూనిటీ హాల్లో అతడికీ, భార్య సుబ్బాయమ్మ గారికీ దండలేసి, ఓ చెక్క ముక్క చేతి కిచ్చి, ఓ గుడ్డముక్క (శాలువా) కప్పేరతనికి. అతడి విజయం వెనక కాస్తో కూస్తో అతడి భార్య సుబ్బాయమ్మ గారి సహకారం ఉన్నందున అతడు ''అర్ధ నారీ శ్వరు''డయ్యేడని పొగిడేరు.



# ముప్పావునారీశ్వరుడు

అది తెలిసిన కాలనీ మహిళా సంఘం సభ్యులు కుతకుతలాడిపోయారు. అతనిని అర్ధ నారీశ్వరుడని పొగిడి, సుబ్బాయమ్మగారికి అన్యాయం చేశారని, నిజానికి వైశంపాయనుడికి సగం దృశ్యం కూడా లేదని వాళ్ల అభిప్రాయం. ప్రతీకారంగా ఏం చేద్దామా అని తీవ్రంగా ఆలోచించి మహిళా మండలి తరపున వాళ్లిద్దరికీ మరో సన్మానం చేస్తామని ప్రకటించారు.

సన్మానసభలో చిన్నస్టూలు వైశంపాయనుడికి వేసి, సింహాసనం లాంటిది సుబ్బాయమ్మ గారికి వేశారు. కాలనీలో మహిళలంతా ఒకరి తర్వాత ఒకరు సుబ్బాయమ్మ గారి ఘనత గురించి చెప్పి, వైశంపాయనుడి ఘనత వెనక మూడు వంతుల పాత్ర ఆమెదే కనుక వైశంపాయనుడు ''అర్ధనారీశ్వరుడు'' ఎంతమాత్రమూ కాడని ''ముప్పావు నారీశ్వరు'' డని బిరుదిచ్చారు.

ఏదో ఒకటి! సన్మానం చేశారు, అంతే చాలని సంబరపడిపోయాడు వైశంపాయనుడు.

*